గాయపడిన వృద్ధుడు మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. మండలంలోని సౌదరదిన్నెకు చెందిన దస్తగిరి(65) తెల్లవారుజామున టీ తాగేందుకు కోవెలకుంట్లకు వెళ్లాడు. తిరిగి సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా పట్టణ శివారులోని డిగ్రీ కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుళ్లదూర్తిలో ఘర్షణ.. ఇద్దరిపై కేసు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో ఆదివారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఘర్షణకు దిగి శాంతిభద్రతలకు భంగం వాటిల్లే ప్రవర్తించినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహాకుంభాభిషేక వేడుకలు ప్రారంభం



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాకుంభాభిషేక వజ్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వేద పండితుల ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, గంగాయనం, యాగశాల ప్రవేశం, తోరణ పూజ, అఖండ దీపస్థాపనం, అంకురార్పణ, హోమ పూజలు జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. రాత్రి పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ ఆధ్యాత్మిక ప్రవచనాలు, వారాహి అమ్మవారి ఊరేగింపు జరిగినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు.

సిమెంట్ లారీ బోల్తా

బనగానపల్లె రూరల్: పట్టణంలోని బేతంచర్ల మార్గంలో ఆదివారం తెల్లవారుజామున సిమెంట్ లోడుతో వెళ్తున్న ఐచర్ లారీ బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు.. దాల్మియా సిమెంట్ లోడుతో కర్నూలు వైపు ఐచర్ లారీ వెళుతోంది. బనగానపల్లె ఎండీహెచ్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫోర్‌లైన్ డివైడర్‌ను వేగంగా ఢీకొని బోల్తాపడింది. సిమెంట్ బస్తాలన్నీ రోడ్డుపై పడ్డాయి. అయితే ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగ లేదు. డ్రైవర్ నూర్ అహ్మద్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ ప్రవీణ్‌కుమార్ జేసీబీతో వాహనాన్ని పక్కకు తరలించి ట్రాఫిక్‌కుఅంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో కూడా ఈ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని.. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బోల్తా పడిన సిమెంట్ లారీ

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బనగానపల్లె: మండలంలోని నందివర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం పక్కీరారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, కుమార్‌బాబు, ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తిరాజు, రామిరెడ్డిలను సత్కరించారు. పూర్వ విద్యార్థులు సీఐ ఆంజనేయులు, అశోక్‌కుమార్, రమణ, విష్ణువర్ధన్, చంద్రమోహన్, ఆర్‌ఐ శేషాద్రి, కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు



పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. లేకుంటే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ రమేష్‌బాబు ఉన్నారు.

ఘనంగా గంగ జయంతి



కలశాలతో చిన్నారులు, మహిళలు

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గంగ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బాలికలు, మహిళలు 108 కలశాలతో రామేశ్వరస్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వాష్టోత్తర శతనామావళి, మహానైవేద్యం, మంగళహారతి తదితర పూజలు చేశారు. వైశాఖ మాసం శుద్ధ సప్తమి రోజు ఈశ్వరుడు గంగను జటాయుదువులో బంధించిన రోజు గంగ జయంతి అని అర్చకుడు భాస్కరయ్య పేర్కొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి కొలిమిగుండ్ల పట్టణానికి చెందిన కొప్పుల శేషయనారెడ్డి కుటుంబ సభ్యులు రూ.35వేల విరాళం ఇచ్చారు. ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో అర్చకులకు అందజేశారు. దాతలను సన్మానించారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి వారం పాటు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని వెల్లడించారు.

మూడు ఫ్యాన్లు వితరణ

డోన్ రూరల్: మండలంలోని ఓబులాపురం మిట్ట వద్ద ఉన్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమానికి కర్నూలు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మూడు సీలింగ్ ఫ్యాన్లు అందించినట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. డీఎస్పీ బంధువులు ఆదివారం ఆశ్రమ కమిటీ సభ్యులు ఎల్లయ్య, రామాంజనేయులును కలిసి వీటిని అందజేశారు. న్యాయవ్యాది నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

సేవతోనే మానవ జన్మకు సార్థకత

బేతంచెర్ల: సమాజానికి సేవ చేయడంతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని జిల్లా రోటరీ క్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ హాల్‌లో మండలంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులు, సమాజ సేవకులను సన్మానించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె రూరల్/సంజామల: పట్టణంలోని భానుముక్కలలో ఉన్న కొట్నాల వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ ఆదివారం భూమి పూజ చేశారు. ముఖ మండపం, రాజగోపురం నిర్మాణానికి దేవదాయ శాఖ నుంచి రూ.3.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. సంజామల మండలం పేరుసోములలోని చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ చేశారు. టీటీడీ శ్రీనివాణి ట్రస్ట్ నుంచి మంజూరైన రూ.2.21 కోట్లతో పనులు చేయనున్నారన్నారు. ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న లాలమ్మ దాచుకున్న రూ.25 వేలను ఆలయ అభివృద్ధికి అందజేయడంతో మంత్రి ఆమెను సత్కరించారు.



వేసవిలో తస్మాత్ జాగ్రత్త

● పెరిగిన ఉష్ణోగ్రతలు ● జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బ తగిలే అవకాశం



డోన్: ఎండలు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం 8 గంటల కే సూర్యుడు తన ప్రతాపాన్ని చూ పుతున్నాడు. 10 గంటలకే ఉక్కపోత మొదలై జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. డోన్‌లో రద్దీగా ఉండే రైల్వేస్టేషన్, బస్టాండ్లు, ఆటో స్టాండ్లు జనసంచారం లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

జాగ్రత్తలు అవసరం

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని నంద్యాల జిల్లా ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ మాధవకృష్ణ పేర్కొన్నారు. మనిషి మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే నాడులు ఎండవేడిమికి దెబ్బతినే ప్రమాదం ఉందని.. మృత్యువాత పడే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. తలనొప్పి, తల తిరగడం, చర్మం ఎండిపోవడం, జ్వరం రావడం, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. ఎండలో తిరగాల్సి వచ్చినప్పుడు కాస్త ఉప్పు కలిపిన మజ్జిగ లేదా పళ్లరసాలు తాగాలని.. తెల్లని దుస్తులు ధరించేందుకే ప్రాధాన్యతనివ్వాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాల్సినవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.



డాక్టర్ మాధవకృష్ణ